

రెండు రోజులు బర్డ్‌వాక్

చెన్నూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు రేంజ్ పరిధిలోని భీమారం గొల్ల వాగు ప్రాజెక్టు నుంచి మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలోని అర్బన్ పార్కు వరకు రెండు రోజుల పాటు బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తామని చెన్నూరు ఫారెస్టు రేంజ్ అధికారి శివకుమార్ తెలిపారు. శనివారం గొల్లవాగు ప్రాజెక్టు వద్ద ఈ కార్యక్రమం ప్రారంభమై కిష్టంపేట అర్బన్‌పార్కులో ముగుస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఫీజు రూ. 2 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇందుకు 9502109454, 9390980096 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రవాణా మార్గం ఉంటేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

నెన్నెల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం మెరుగ్గా ఉండాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండలంలో పలు రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెన్నెల మండల కేంద్రం టీ రోడ్డు నుంచి కుశ్నపల్లి గ్రామానికి రూ.3.53 కోట్లతో, మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి కొత్తగూడెం గ్రామానికి కోటి, దుబ్బగూడెం నుంచి మన్నెగూడెం గ్రామానికి రూ.2.20 కోట్లతో పనులు మంజూరయ్యాయన్నారు. వీలైనంత త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలని సూచించారు. మాజీ ఎంపీపీ తారాచంద్, హరీష్, గట్టు మల్లేష్ గౌడ్, తోట శ్రీనివాస్, మల్లా గౌడ్, చిన్నోజి శంకరయ్య, మహేష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, గట్టు బానేష్, గజేందర్ సింగ్, నాయకులు పాల్గొన్నారు.



పండుగ పూట పస్తులేనా..?

హమాలీల సమ్మెతో నిలిచిన బియ్యం సరఫరా

- స్టాక్‌లేక వెలవెలబోతున్న చౌక ధరల దుకాణాలు
- సంక్రాంతి పిండి వంటలకు దొడ్డు బియ్యం కరువు
- రేషన్ షాపుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

మంచిర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హమాలీల సమ్మెతో చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. సంక్రాంతి పిండి వంటలు చేసుకోవడానికి ఎక్కువ శాతం రేషన్ బియ్యం వినియోగిస్తారు. పండుగ సమీపిస్తున్నా రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ జరగడం లేదు. ప్రతీ నెల ఒకటవ తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం అందించాల్సి ఉంటుంది. నెల ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నా చౌక ధరల దుకాణాలు తెరుచుకోకపోవడంతో పండుగపూట పేదలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బియ్యం ఎప్పుడు పోస్తారో తెలియని పరిస్థితుల్లో నిత్యం షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక డీలర్లు దుకాణాలు మూసి ఉంచుతున్నారు. పండుగల సమయంలోనూ సకాలంలో బియ్యం అందజేయడంలో జాప్యం పట్ల లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల ఏదో ఒక సాకు చెబుతూ నెలాఖరు దాకా బియ్యం పంపిణీ చేయడం లేదని అసహనానికి గురవుతున్నారు.

సమ్మెబాటలో హమాలీలు...

తమ డిమాండ్ల పరిష్కారానికి మండల లెవల్ స్టాకిస్టు (ఎంఎల్ఎస్) పాయింట్లలో పని చేస్తున్న హమాలీలు సమ్మెబాట పట్టారు. నాలుగు రోజులుగా గోదాముల వద్ద హమాలీలు సమ్మె చేస్తుండటంతో ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా కావడం లేదు. స్టేజి-1 నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు లారీల ద్వారా వచ్చే బియ్యాన్ని దింపుకోవడం, చౌక ధరల దుకాణాలకు చేరవేయడానికి లారీల్లోకి ఎక్కించడం, లారీల నుంచి రేషన్ షాపుల్లో స్టాక్‌ను దింపడం హమాలీల విధులు.

ప్రతీ నెల ఇదే తంతు...

జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల ఏదో ఒక కారణంతో బియ్యం పంపిణీలో ఆలస్యం జరుగుతోంది. చాలా సార్లు ఈ - పాస్ యంత్రాల్లో సాంకేతిక లోపం తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. ఏదో సాకు చూపి బియ్యం ఆలస్యంగా పోస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. వాస్తవానికి చౌక ధరల దుకాణాల ద్వారా ప్రతీ నెల ఒకటవ తేదీ నుంచి 15వరకు బియ్యం అందజేయాలి. రెండు మూడు నెలలుగా బియ్యం ఎప్పుడు పోస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. గత నెలలో కూడా స్టేజి-1 కాంట్రాక్టర్ నుంచి సరఫరా కాలేదని అరొకర స్టాకును పంపించారు. ప్రస్తుతం హమాలీల సమ్మెతో ఈ నెలలో కూడా బియ్యం పంపిణీ జరగడం లేదు. బియ్యం సరఫరా ఎప్పుడవుతుందో డీలర్లకు కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 423 రేషన్ షాపులు ఉండగా, ఉచిత బియ్యం కోటాలో భాగంగా ప్రతి దుకాణానికి సగటున 120 క్వింటాళ్ల సరఫరా కావలసి ఉంటుంది.

జిల్లాలో కోటపల్లి, చెన్నూర్, మంచిర్యాల, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, తాండూరులో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 48 మంది హమాలీలు పని చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ ప్రభుత్వ హయాంలో రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేపట్టేలా జీవో జారీ చేశారు. అప్పటి నుంచి ఆ పద్ధతి అమలు చేస్తుండగా, 2023 డిసెంబరుతో కాల పరిమితి ముగిసింది.

అప్పటి నుంచి పెంచిన రేట్లు అమలు కాకపోగా, కొత్తగా జీవో కూడా విడుదల చేయలేదు. హమాలీలకు క్వింటాలుకు రూ.26 అమలు చేస్తుండగా గత సంవత్సరం రూ. 29కి పెంచారు. అయితే దానికి సంబంధించిన జీవో విడుదల చేయడం లేదు. దీంతో ఆయా డిమాండ్ల కోసం హమాలీలు ఆందోళనబాట పట్టారు. మిగతా 7వ పేజీలో



మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సమ్మె చేస్తున్న హమాలీలు

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

కలెక్టర్ కుమార్‌దీపక్

గుడిపేట బెటాలియన్‌లో పోలీస్ పాసింగ్ పరేడ్



బహుమతులు అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణ కలిగి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం గుడిపేట 13వ బెటాలియన్‌లో జరిగిన పోలీస్ పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్‌పరేడ్)కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ట్రైనీ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 548 మంది శిక్షణ కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరడం ఆనందంగా ఉందని, ప్రజల రక్షణ, భద్రత కోసం పనిచేయాలన్నారు. పోలీసు శాఖకు గౌరవం తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలన్నారు. ఎవరికైనా ఆపదలో ఉన్నప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనని తెలిపారు. కుల, మత వర్గాలకు అతీతంగా రాగద్వేషాలకు తావివ్వకుండా విధులు నిర్వహిస్తూ సమాజంలో ఏ అండ లేని బలహీన వర్గాల ప్రజల రక్షణ, అభివృద్ధికి పాటుపడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఎప్పుడైతే శాంతి భద్రతలు, నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉంటుందో అక్కడ ప్రజలు సుఖ శాంతులతో ఉంటారన్నారు. నేడు ప్రధానంగా ఉగ్రవాదం, తీవ్రవాదం, నక్సలిజం, సైబర్ నేరాల సమస్యలతో ప్రజలు సతమత మవుతు న్నారన్నారు. వీటిని అణిచివేయడానికి పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

మిగతా 7వ పేజీలో



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బాలిక విద్య కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే | కలెక్టర్ కుమార్‌దీపక్ 7



అరచేతిలో మీసేవ..

230 రకాల ప్రభుత్వ సేవలను పొందే వెసులుబాటు

6

అంధుల జీవితాల్లో అక్షర వెలుగులు

అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ

నేడు జయంతి, 6న వర్ధంతి

7



సాయి దృష్టి అంధుల పాఠశాల

రైతుల ధాన్యం పక్కదారి..

బోనస్ కోసం ఫోర్జరీ సంతకాలు

గూడెం చెక్ పోస్టు వద్ద పట్టుకున్న ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దండేపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కోసం ఫోర్జరీ సంతకాలు చేసి లారీలో ధాన్యాన్ని తరలిస్తుండగా రెవెన్యూ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న సంఘటన కొత్తమామిడిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. రెవెన్యూ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ డీటీ అంజయ్య, లింగయ్య, స్రవంతిలు తెలిపిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. కొత్తమామిడిపల్లి గ్రామానికి చెందిన ఎంబడి సురేందర్, దనిశెట్టి నరేష్‌లు 295 ధాన్యం బస్తాలను రైతుల వద్ద కొనుగోలు చేసి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ఓ ప్రైవేటు రైస్ మిల్లుకు తరలి స్తున్నారన్నారు. గూడెం అటవీ చెక్‌పోస్ట్ వద్ద మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బొద్దుల భూమన్న లారీ ఆపి తనిఖీ చేయగా ఫారం 10పై తహసీల్దార్ సంతకం ఉంది.

గ్రామ ప్రత్యేకాధికారి అయిన తహసీల్దార్ లీవ్‌లో ఉండగా సంతకం చేసి ఉండటంతో అనుమానం వచ్చిన ఆర్ఐ తహసీల్దార్‌కు ఫోన్ చేసి అడుగగా సంతకం తనది కాదని తహసీల్దార్ పేర్కొన్నట్లు తెలిపారు. సంతకం ఫోర్జరీ చేసి ఉండటంతో అనుమానం వచ్చి లారీని దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామంలోని రైతులను విచారించగా తమ అవసరాల నిమిత్తం అమ్ముకొన్నామని వారు పేర్కొన్నారన్నారు. ఐకేపీ ద్వారా ప్రభుత్వం అందించే రూ.500 బోనస్ కోసం 570 ఖాళీ గన్నీ సంచులను లారీలో తరలిస్తున్నారని వివరించా రు. సురేందర్, నరేష్‌తో పాటు గన్నీ సంచులను అందించిన ఐకేపీ వీవోఏ శ్రీలతపై కేసు నమోదు చేశామని రెవెన్యూ ఎన్ఫోర్స్‌మెంట్ డిటిలు వెల్లడించారు. కాగా, ఖాళీ సంచులు తరలించడంతో రైసుమిల్లుతో కుమ్మక్కైన దళారులు ప్రభుత్వం మంజూరు చేసిన గన్నీ సంచుల్లో బోగస్ రైతుల పేరిట కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే ప్రభుత్వ పరంగా రూ.500 బోనస్ కలిసి వచ్చే అవకాశం ఉండడంతో అక్రమ రవాణా తెరలేపినట్లు సమాచారం.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జైపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యా హ్న భోజన పథకం కార్మికుల సంఘం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. వెంటనే వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులపై ప్రభుత్వం భారం వేస్తుందన్నారు. నెలకు రూ.10 వేలు చెల్లించాలని, కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలని, వంటగ్యాస్ ఉచితంగా ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు మధునక్క, రమాదేవి, చిన్నక్క, భూదమ్మ, పద్మ, మంజుల, కల్పన, భీమక్క పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న జాదవ్ అంబాజీ

ఆశ్రమ పాఠశాల తనిఖీ

వేమనపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లిలోని ఆశ్రమ పాఠశాలను శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. మెనూ పాటించాలని, ఆహారం వేడిగా అందించాలన్నారు. వంట పాత్రలు, వంట గదులను పరిశుభ్రంగాఉంచాలన్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న ప్రహరీ పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా పూర్తయ్యేలా చూస్తానని తెలిపారు. ఏసీ ఎంఓ రాజమౌళి, ఉపాధ్యాయులున్నారు.





క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

తాండూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ దేవాలయం సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ చెందిన పంచెర్పుల శ్రీకాంత్ (30) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. శ్రీకాంత్ స్నేహితులతో కలిసి శుక్రవారం ఉదయం కన్నాలకు, అనంతరం బుగ్గ ఆలయం సమీపంలోకి వచ్చారన్నారు. అక్కడ ఫారెస్టు ట్రెంచ్‌లో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ స్నేహితుడు సురేష్‌గౌడ్ మృతుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. మృతుడి తండ్రి పోశం ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆవుల ఓదెలు(ఫైల్)

భీమారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భీమారం గ్రామానికి చెందిన ఆవుల ఓదెలు (43) శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు. ఓదెలు మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకోకపోవడంతో భార్య రెండు సంవత్స రాల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఓదెలు తల్లి వద్ద ఉంటున్నాడు. డిసెంబరు 23న మద్యం మత్తులో కూల్‌డ్రింకులో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు మంచి ర్యాల ఆసుపత్రికి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



గౌసొద్దీన్ (ఫైల్)

మంచిర్యాల క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నస్పూర్ మండలం లోని గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ గౌసొద్దీన్(59) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగి ఉండగా మంచిర్యాల ఐబీ నుంచి సీసీసీకి ఆటోలో వెళ్తున్న మహ్మద్ గౌసొద్దీన్ అతి వేగంగా బస్సును ఢీకొనడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు మహ్మద్ జాకిర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పోలీసుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

మంచిర్యాల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాంధీనగర్‌కు చెందిన యువతి అదృశ్యం కావడంతో యువతి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యువతి కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించగా అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తితో హైదరాబాద్‌కు వెళ్లిందని సమాచారం తెలుసుకున్నారు. యువతి, యువకుడు హైదరాబాద్ బాచుపల్లిలో ఉండగా యువతిని మంచిర్యాలకు తీసుకువచ్చారు. తల్లిదండ్రులు యువతిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని బాచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడి పోలీసులు యువతి తల్లిదండ్రులను పిలిపించి బెదిరింపులకు పాల్పడ్డారని, మనస్తాపానికి గురైన యువతి తండ్రి వినోద్ శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. స్థానిక పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. సదరు యువకుడిపై యువతి ఫిర్యాదు చేయడంతో యువతిని ఎత్తుకెళ్లిన యువకుడితో పాటు మరికొందరిపై మంచిర్యాల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి తండ్రి ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మందమర్రిరూరల్, టౌన్/జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండ లంలోని అందుగులపేట సమీపంలోని రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐత రాజు (24) అనే యువకుడు అక్కడి కక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల మండలం ర్యాలీగడ్‌పూర్‌కు చెందిన ఐత రాజు కూలీ పనులు చేసేవాడు. శుక్రవారం భీమిని మండలంలోని బీంపూర్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి బైక్‌పై రాజు, కళ్యాణ్, ప్రభాస్‌లు మంచిర్యాలకు వస్తున్నారు. ఈ క్రమంలో అందుగులపేట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు కళ్యాణ్, ప్రభాస్‌లు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి చంద్రయ్య తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

గన్నీ సంచుల గోదాంలో అగ్నిప్రమాదం

-రూ. 25 లక్షల ఆస్తినష్టం



గన్నీ సంచుల గోదాంలో చెలరేగుతున్న మంటలు

బెల్లంపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాల్‌టెక్స్‌లో గల అక్షర ఎంటర్‌ప్రైజెస్ గన్నీ సంచుల గోదాంలో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. యజమాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం గన్నీ సంచుల గోదాంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని, దీంతో మంటలు చెలరేగి గోదాంలో ఉన్న దాదాపు రూ.25 లక్షల విలువ గల గన్నీ సంచులతోపాటు మిషన్‌లు అగ్నికి కాలిపోయాయన్నారు. గోదాం పక్కన నిద్రిస్తున్న కార్మికులు మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా

భీమారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భీమారం గ్రామంలోని అడవిలో రోడ్డు పక్కన లారీ ఆపి డ్రైవర్ బండి ఓదెలు కోతులకు ఆహారం వేస్తుండగా అటవీ అధికారులు రూ.3 జరిమానా విధించారు. కోతులకు ఆహారం వేయడం వల్ల రోడ్లపైకి వచ్చి వాహనాల కింద పడి చనిపోతున్నాయని తెలిపారు. ఆహారం వేయవద్దని సూచించారు. అటవీ అధికారులు సుధాకర్, బానేష్, శివకుమార్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణ

జైపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :సీసీ కెమెరాల ద్వారా నేరాలను నియంత్రించవచ్చని సీఐ వేణుచందర్ పేర్కొన్నారు. శుక్రవారం రామారావుపేటలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్థులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఇండ్లలో కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఎస్ఐ శ్రీదర్, కానిస్టేబుల్ మల్లయ్య, సదానందం ఉన్నారు.

అరచేతిలో మీసేవ..

- 230రకాల ప్రభుత్వ సేవలను పొందే వెసులుబాటు



వాంకిడి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం ప్రజాపాలనలో విజయోత్సవాల్లో భాగంగా ఇటీ వల మీసేవ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వశాఖల పౌర సేవలు ఇకనుంచి అరచేతిలో లభించనున్నాయి. దీంతోపాటు త్వరలోనే కూడళ్లలో కియోస్క్ యంత్రాల ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. టచ్‌స్క్రీన్, స్కానర్, ప్రింటర్లతో కూడిన ఈ యంత్రంలో ఆన్‌లైన్‌లో వివిధశాఖల సేవలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతరుల ప్రమే యం లేకుండా ప్రింట్ తీసుకోవచ్చు. ఇవి అందు బాటులోకి వస్తే మీ సేవ కేంద్రాలకు గడ్డుకాలమే.

2011 నంచి మొదలు..

వివిధ ధ్రువీకరకణ పత్రాల జారీ వేగవంతానికి 2011లో రాష్ట్రప్రభుత్వం మీసేవ కేంద్రాలను అందు బాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 33జిల్లా ల్లో 5243కేంద్రాలు నడుస్తున్నాయి. ఇటీవల ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మీసేవ యాప్‌ను ప్రారంభించారు. మొబైల్‌ఫోన్‌లో దీనిని డౌన్‌లోడ్ చేసుకొని 230రకాల ప్రభుత్వసేవలను పొందే వెసులుబాటును కల్పించారు.

● తగ్గనున్న గిరాకీ..

మీసేవ యాప్ కియోస్కుల ఏర్పాటుతో 13ఏళ్లుగా నడుస్తున్న మీసేవకేంద్రాల గిరాకీపై ప్రభావం పడే అవ కాశాలు ఉన్నాయని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. తమకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతుందని ఆవేదన చెందుతున్నారు. ధ్రువీక రణ పత్రాలకు దరఖాస్తు, జారీ అనంతరం కియోస్క్‌లో ప్రింట్‌తో మీసేవ కేంద్రాలతో పనిలేకుండా పోనుంది. గ్రామీణ ప్రాంతాల్లో వీరు ఎక్కువగా చేసే పహాణీ నకల్‌సేవను గతంలో ధరణి పోర్టల్‌లోకి మార్చడంతో కొంత మేర ఆదాయం కోల్పోయారు. విద్యుత్తు బిల్లు, ఇంటర్‌నెట్, అద్దె, స్టేషనరీ, కంప్యూటర్ నిర్వహణ ఖర్చులను నిర్వాహకులు భరిస్తూ కేంద్రాలను నడుపుతున్నారు. ఇప్పుడు ఈ యాప్‌తో అనుకున్న మేర ఆదాయం రాక కేంద్రం నిర్వహణ భారంగా మారనుంది.

బారెగూడను గ్రామపంచాయతీగా చేయాలి

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలంలోని డబ్బాబారెగూడ గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటుచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండెవిఠల్‌కు శుక్రవారం మాలి సంక్షేమసంఘం నాయకులు కాగజ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లతోపాటు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అర్షద్‌హుస్సేన్, మాలిసంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు నికోడె బాపూరావు, వడై శ్రీనివాస్, పెద్ద బాపూరావు, గుర్లె విలాస్, అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

బెజ్జూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ భూమేశ్వర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు ధాన్యం ఎంత కొనుగోలు చేశారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల5 నుంచి కొనుగోలు కేంద్రం మూసి వేస్తున్నామని ఇంకా ఎవరైనా రైతులు ఉంటే ఆలోగా వరిధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ఆయన వెంట సీసీ భద్రయ్య తదితరులున్నారు.

రిటైర్డ్ సీఆర్పీఎఫ్ ఎస్సైకి ఘనస్వాగతం

చింతలమానేపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 37సంవత్సరాలుగా సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లో ఎస్సైగా పనిచేసి పదవీవిరమణ పొందిన రవీంద్రనగర్-1 గ్రామానికి చెందిన ఆర్ఎస్ సర్కార్ శుక్రవారం స్వగ్రామానికి రాగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 6.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలిపంజా విసురుతోంది. శుక్రవారం సిర్పూర్ (యు) మండలంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయింది. తిర్యాణి మండలంలో 6.6డిగ్రీలు, కెరమెరిలో 9.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మంచిర్యాల: జిల్లాలోని కోటపల్లి మండలం దేవులవాడలో శుక్రవారం 10.7డిగ్రీలు, జైపూర్ మండలంలో 11.4, జన్నారం మండల కేంద్రంలో, తపాలపూర్ 11.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దండేపల్లి: జిల్లాలో చలి మళ్లీపెరిగింది. రెండురోజుల నుంచి చలి వణికిస్తోంది. సాయంత్రం 6 నుంచి ఉదయం 9గంటల వరకు చలితో చిన్నపెద్ద తేడా లేకుండా ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో చలిమంటలు కాగుతున్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

జైనూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున కల్వర్టును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లూరి శ్రీనివాస్(42) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. జైనూర్ ఎస్ఐ సాగర్ కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన మల్లూరి శ్రీనివాస్, మాదే చింటు (45) మసాదేశ్రీనివాస్(40) బోర్ల నగేష్(50) మహారాష్ట్రలోని పండరీపూర్‌లో దైవదర్శనం చేసుకొని కారులో తిరిగి వస్తున్నారు. జంగాం సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి కల్వర్టును బలంగా ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందగా చింటు, మసాదే శ్రీనివాస్, నగేష్‌కు గాయపడ్డారు. అ జాగ్రత్తగా వేగంగా కారు నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. క్షతగాత్రులను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కి తరలించారు. మృతుడి అన్న శివరాం కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి



వాంకిడి కళాశాలలో సావిత్రిబాయిఫూలేకు నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు



కాగజ్‌నగర్‌లో ఫూలే విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న నాయకులు



కౌటాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాల వేస్తున్న మాలి సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి ఫూలే జయంతి వేడుకలను శుక్రవారం బీసీ సంక్షేమసంఘం, మాలీసంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని సాలేగూడలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరై సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్‌రమేష్, మాజీఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సావిత్రి బాయి ఫూలే ఆశయాలను కొనసాగించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ మాలీకులస్థుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: సావిత్రి బాయి ఫూలే 194వ జయంతిని శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కోసినిగ్రామంలో మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అన్నివర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి ఆమె ఎనలేని కృషిచేసిందన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో కూడా సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలి సంక్షేమసంఘం రాష్ట్ర నాయకులు లెండుగురె శ్యాంరావు, వసాకె హన్మంతు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కెరమెరి: కెరమెరి మండలం గోయగాం గ్రామంతో పాటు కెరమెరి జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి ఫూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫూలే దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాలలో మహిళా అధ్యాపకులు సరళ,కౌసల్యను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామపటేల్ శంకర్, లక్ష్మణ్, పోశెట్టి, పాండురంగ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ప్రభుత్వజూనియర్‌కళాశాల, వాంకిడి ఉన్నత పాఠశాల, జేతావన్ బుద్ధవిహార్, మాలీ సంక్షేమసంఘంతో పాటు గ్రామాల్లో సావిత్రిబాయి ఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆయా కార్యాక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు కిరణ్, శ్రీధర్, అశ్విని, తిరుపతి, సంతోష్, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, అంబేద్కర్ సంఘం నాయకులు, మాలీసంఘం నాయకులు నాయకులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొత్తూరి ఆంద్రయ్య, ఉపాధ్యాయులు రాజుకైలాష్‌భూమన్న తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలకేంద్రంలోని మాలిసంఘ భవనంలో సావిత్రిబాయిఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలిసంఘం నాయకులు నాందేవ్, అంజనేయులు, రాంబాబు, రజిత, శ్రీనివాస్, ముక్తేశ్వర్, చందు, పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోశం, నాయకులు వెంకటేష్, శంకర్, రాజరాం, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట/చింతలమానేపల్లి/బెజ్జూరు/రెబ్బెన: మండలాల్లో ప్రజలు, మాలి సంఘం నాయకులు సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెబ్బెనలో ఫూలే సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు మోర్లే తిరుపతి, జిల్లా నాయ కుడు గుర్నులే సత్తయ్య తదితరులు పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.

చింతలమానేపల్లిలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో జయరాజు, బెజ్జూరులో జరిగిన కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు రామకృష్ణ, బాబురావు, శంకర్, భీమన్న, మోహన్, రెబ్బెనలో జరిగిన కార్యక్రమంలో మాజీసర్పంచి వడై శాంత, ఫూలే సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



పెంచికలపేటలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



చింతలమానేపల్లిలో..



బెజ్జూరులో నివాళులు అర్పిస్తున్న నాయకులు



కార్మికులకు హక్కులు సాధించి పెడతాం

- ఐఎన్టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవిభూమయ్య

మందమర్రి టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని కాంపెల్లి సమ్మయ్య, దేవిభూమయ్య తెలిపారు. శుక్రవారం ఐఎన్టీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎన్నికలు జరిగి సంవత్సరం గడిచిందని, గుర్తింపు సంఘం ఏం సాధించిందో చెప్పాలన్నారు. నిర్ణయాత్మక సమావేశంలో కూడా కార్మికుల సమస్యలను ప్రస్తావించలేదని, ఇంతకన్నా దారుణం మరోటి ఉండదని తెలిపారు. కార్మికులు లక్ష్యాలను అధిగమించాలంటే మెరుగైన పనిస్థలాలను ఏర్పాటు చేయాలని, అధికారులు ముందస్తుగా పని స్థలాలను పరిశీలించాలన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం తమ యూనియన్ ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటుందన్నారు. సమావేశంలో కేంద్ర, ఏరియాకమిటీ నాయకులు రాంశెట్టి నరేందర్, శంకర్‌రావు, ఆయా గనుల పిట్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు పాటుపడిన సావిత్రీబాయి ఫూలే



డిస్పెన్సరీలో నివాళులు అర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

శ్రీరాంపూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి ఫూలే ఆనాటి కాలంలోనే బాలికలు విద్యను అభ్యసించేందుకు ఎంతో కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని పలు గనులు, విభాగాల్లో సావిత్రీబాయి ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆమె చేసిన సేవను కొనియాడారు. ఆర్కే8 డిస్పెన్సరీలో డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్ బాబు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. వైద్యులు లోక్‌నాథ్ రెడ్డి, మురళీధర్, మనీషా, దీప్తి, పింకీ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్కే6 గనిలో మేనేజర్ తిరుపతి కేక్ కట్ చేశారు. రక్షణాధికారి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, సంక్షేమాధికారి సురేందర్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆర్కే5 గనిలో వేడుకలు నిర్వహించారు. మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, నాయకులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా బీసీ సంక్షేమసంఘం నాయకుడు బద్రి బుచ్చయ్య ఆధ్వర్యంలో వివిధగనులు, విభాగాలపై వేడుకలు నిర్వహించారు.

ఉద్యోగులకు పదోన్నతి పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఏరియాలోని ఆర్కే7 గనిలో సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్స్(ఎస్ఎల్‌పీ) పత్రాలను మేనేజర్ తిరుపతి శుక్రవారం ఉద్యోగులకు అందించారు. ఏడేళ్లు పనిచేసిన ఉద్యోగులు పదోన్నతులు పొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సంక్షేమాధికారి సంతన్, పిట్ కార్యదర్శి మారేపల్లి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేసి ఆర్‌జీ-2 డివిజన్‌కు బదిలీపై వెళ్తున్న ఇంజనీర్ శ్యాంసుందర్‌ను ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇంజనీరింగ్ విభాగంలో శ్యాంసుందర్ ఎన్నో సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ రీజినల్ ప్రధానకార్యదర్శి జీవన్ జోయల్, కేంద్ర కార్యదర్శులు జగన్, శ్రీనివాస్, వెంకటస్వామి, మారుతి, బ్రాంచ్, పిట్ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

పండుగపూట పస్తులేనా...?

5వ పేజీ తరువాయి

ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించేదాక వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని హమాలీలు తేల్చి చెబుతున్నారు.

హమాలీ రేట్ల జీవో విడుదల చేయాలి



సివిల్ సప్లయి విభాగంలో పని చేస్తున్న హమాలీలకు రేట్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించినందున జీవోను తక్షణమే విడుదల చేయాలి. అలాగే పెరిగిన రేట్లు నుంచి అమలు చేయక పోవడంవల్ల హామీలు ఆర్థికంగా నష్టపోవలసి వస్తోంది. బకాయిలు వెంటనే విడుదల చేయడంతోపాటు ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేపట్టాలి.

- పానుగంటి సత్యనారాయణ,
సివిల్ సప్లయి జిల్లా ప్రధాన కార్యదర్శి

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

5వ పేజీ తరువాయి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

శిక్షణ సమయంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. అనంతరం కమాండెంట్ వెంకటరాములు మాట్లాడుతూ 2024, ఏప్రిల్ 1న 572 మంది కానిస్టేబుళ్ల శిక్షణకు బెటాలియన్‌లో రిపోర్టు చేశారన్నారు. ఇందులో ఇద్దరు ఫైర్ డిపార్టుమెంట్, ఇద్దరు ప్రభుత్వ టీచర్, 11మంది గ్రూప్ 4, ఒకరు జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. మరో పదిమంది వివిధ కారణాలతో శిక్షణ నుంచి వెళ్లిపోయారన్నారు. 542మందికి శిక్షణపూర్తి చేశామన్నారు. అనంతరం శిక్షణ కానిస్టేబుళ్లు పలు విన్యాసాలను ప్రదర్శించారు. డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, మెడికల్ ఆఫీసర్ సంతోష్‌సింగ్, ఏవో ఉమేష్‌కుమార్, జీఎం సూర్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



ట్రైనీ కానిస్టేబుళ్లు చేస్తున్న ప్రదర్శనలు

చిన్ననాటి కల నెరవేరింది



నా స్వగ్రామం చెల్లాపూర్ గ్రామం. దుబ్బాక మండలం సిద్దిపేట జిల్లా. చిన్ననాటి నుంచి పోలీసు కావాలని కల ఉండేది. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసి డిగ్రీ చదివించారు. డిగ్రీ పూర్తయిన వెంటనే కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నా. ఇంటి వద్దనే చదువుకున్నాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను.

- బెక్కంటి హరీష్

సమాజ సేవ చేయడమే లక్ష్యం



నాది షామీర్‌పేటలోని సైబరాబాద్. బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసి పోలీసు ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యాను. కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. సమాజ సేవ చేయడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తాను. శిక్షణలో ఎన్నో విషయాలను నేర్చుకున్నాను.

- వేది సుధీర్

అంధుల జీవితాల్లో అక్షర వెలుగులు



సంస్కృతిక కార్యక్రమాల్లో అంధ విద్యార్థులు

- అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ
- నేడు జయంతి, 6న వర్ధంతి
- జిల్లా సాయి అంధుల పాఠశాల ఏర్పాటు



సాయి దృష్టి అంధుల పాఠశాల

నస్పూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంధకారంలో మగ్గుతున్న జీవితాలకు లిపిని రూపొందించి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ. అతను రూపొందించిన లిపితో రంగుల ప్రపంచాన్ని చూడలేక పోయిన చదువులో సత్తాచాటుతున్నారు. మంచిర్యాల జిల్లాలో దాదాపు 350 మంది వరకు అంధులు ఉన్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, వివిధ ఆర్గనైజేషన్లు అంధులకు సేవలు అందిస్తున్నాయి. శనివారం అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలో సాయి అంధుల పాఠశాల ఏర్పాటుచేసి అంధ విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. తాము ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తు న్నారు అంధ విద్యార్థులు. చదువుతో పాటు సంగీతం, ఆటపాటలు, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు.

లూయిస్ బ్రెయిలీ నేపథ్యం...

ఫ్యారీస్ పట్టణ సమీపంలోని క్రూవే గ్రామానికి చెందిన మోనిక్ బ్రెయిలీ, సైమన్‌రెనె బ్రెయిలీ దంపతులకు 1809 జనవరి 4న లూయిస్ బ్రెయిలీ జన్మించారు. నాలుగేళ్ళ వయస్సులో లూయిస్ బ్రెయిలీ ప్రమాదానికి గురై చూపును కోల్పోయాడు. పాఠశాలకు వెళ్ళి వినడం మినహా అక్షరాలను చదివే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరిస్థితిని చూసిన తండ్రి చెక్కపై అక్షరాలను చెక్కి ఇచ్చేవారు. అంధుల పాఠశాలలో చేరగా రాగి రేకులపై రాసిన అక్షరాలను చదవాలంటే ఇబ్బంది కలిగేది. అయినా పట్టుదలతో చదివి అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. అంధులు చదవాలంటే స్పర్శతో కూడిన లిపి అవసరం ఉంటుందని గుర్తించారు. ఉబ్బెత్తుచుక్కలతో కూడిన సులభమైన పద్ధతి ద్వారా లిపిని కనుగొన్నారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ పేరు చివరి అక్షరాలను కలిపి బ్రెయిలీ లిపిగా నామకరణం చేశారు. అనతి కాలంలోనే లూయిస్ బ్రెయిలీ రూపొందించిన లిపి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. బ్రెయిలీ రూపొందించిన లిపి నేడు అంధుల పాలిట కల్ప తరు వుగా మారి ఎందరో జీవితాల్లో వెలుగు పంచుతోంది. ఇప్పటి వరకు ఎన్నో గ్రంథాలు, పుస్తకాలు బ్రెయిలీ లిపిలో ముద్రించడ్డాయి. క్షయవ్యాధికి గురైన లూయిస్ బ్రెయిలీ 1852 జనవరి 6న మృతి చెందాడు.

సాయి అంధుల పాఠశాల..

కంటిచూపులేని వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో దివంగత అశోక్‌రావు నస్పూర్ పట్టణం ఊరు శ్రీరాంపూర్‌లో సాయి అంధుల పాఠశాలను నెలకొల్పారు. వారికి ఉచిత విద్యతోపాటు భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు. మొదట జిల్లా కేంద్రంలో పాఠశాలను నిర్వహించగా దాతల సహకారంతో స్వంత భవనం నిర్మాణంతో 2010లో ఊరు శ్రీరాంపూర్ తరలించారు. దాతల సహాయ సహకారాలతో పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన కొనసాగుతుంది. ప్రస్తుతం 25మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వివిధ పట్టణాలకు వెళ్ళారని అంధ పాఠశాల, వృద్ధాశ్రమం ఇన్‌చార్జి వసుమతి తెలిపారు. చైర్మన్ రవీందర్‌రావు ఆధ్వర్యంలో పాఠశాల, వృద్ధాశ్రమం నడుస్తుందని పేర్కొన్నారు.

అంధ కళాకారుల ప్రతిభ...

విద్యార్థులు చదువుతో పాటు వివిధ కళా రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. సంగీతం, నృత్యం, తబలా, క్యాసియో, సుమధూర గాత్రం, వాయిద్యం, కంప్యూటర్, మొలిబిలి, భగవద్గీత, జీకే, ఆటల్లో ప్రావీణ్యం పొందారు. పరుగు, షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ టాలెంట్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ అవార్డులు సొంతం చేసుకున్నారు. కే. రాజేందర్, మహేశ్‌లు డోలు, డప్పు వాయిద్యంతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

డిప్లొమో చదువుతున్న



ఇక్కడే ప్రాథమిక విద్యను అభ్యసించాను. ఇంటర్ మంచిర్యాలలో, డిగ్రీ హైదరాబాద్ చదివాను. ప్రస్తుతం డిప్లొమోలో విజివల్ ఇన్‌ఫెర్‌మెంట్ చేస్తున్నాను. సంగీతంలో ప్యాడ్ వాయిస్తాను, చూపులేదన్న బాధ లేదు. అన్ని పనులు చేసుకుంటాను.

- అంధ విద్యార్థి సిరిపురం మహేష్

క్రీడల్లో పాల్గొన్న



తాను సాయి అంధుల పాఠశాలలోనే చదువు కున్న. ఇంటర్ మంచిర్యాలలో, డిగ్రీ నేత్ర కళాశాలలో, ప్రస్తుతం డిప్లొమో చదువుతున్న. పాటలు పాడుతాను, డప్పు వాయింపు, అథ్లెటిక్స్, క్రికెట్ క్రీడల్లో పాల్గొన్నాను. రాష్ట్ర స్థాయిలో క్రికెట్ (బాల్ సౌండ్స్) ఆడాను. చాలా బాగుంది.

- అంధ విద్యార్థి పాతరవేణ రాజు

పాటలు పాడుతాను



నేను సాయి అంధుల పాఠశాలలోనే చదువుకున్నాను. ప్రస్తుతం నిజాం కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న. పాటలు పాడుతాను. సంగీ తం అంటే ఇష్టం.

- గంట రాజేశ్

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

హాజీపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకొంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ముల్కల్ల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నుంచి నస్పూర్‌లోనీ ఈవీఎం గోదాముకు తరలింపు ప్రక్రియను అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, చెన్నూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్ష్యంలో చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలకు సంబంధించి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం నుంచి ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య నస్పూర్‌లోనీ ఈవీఎం గోదాములకు తరలించామన్నారు.

ప్రజల సంక్షేమానికి కృషి



సమావేశంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీఎఫ్‌వో

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జన్నారం మండలం కవ్వాల్ పులుల అభయారణ్యం అభివృద్ధి, వన్య ప్రాణుల సంరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల రక్షణకు కృషి చేస్తోందన్నారు. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోకి వచ్చే మల్యాల గ్రామంలో నివసించే 103 కుటుంబాలను వేరే ప్రాంతానికి తరలించేందుకు ప్రతిపాదించామన్నారు. గ్రామస్థుల పునరావాసం, నష్టపరిహారం సౌకర్యాల కల్పనపై అందిన అభిప్రాయం మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డీఈవో యాదయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



హమాలీల ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీఐటీయు నాయకులు

లక్షెట్టిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సివిల్ సప్లయి గోదాం వద్ద హమాలీ కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో కార్మికులకు సీఐటీయు నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన హమాలీల చార్జీలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హమాలీ రేట్లను పెంచి, ఏరియర్స్‌తో పాటు ప్రత్యేక బడ్జెట్ రీలీజ్ చేస్తున్నట్లు జీవో విడుదల చేయాలని డిమాండ్ చేసారు. మల్లేష్, తిప్పని సత్తన్న, రాజన్న, ఐలయ్య, పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి హమాలీ కార్మికుల రేట్లను పెంచాలని నస్పూర్‌లోని ఎంఎల్ఎస్-పాయింట్ ఎదుట కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. గతేడాది అక్టోబరులో జరిగిన ఒప్పందం ప్రకారం హమాలీ కార్మికుల రేట్ల జీవోను వెంటనే విడుదల చేసి పెరిగిన వేతనాలు ఇవ్వాలని ఈ నెల 1 నుంచి సమ్మెలోకి వెళ్ళారు. హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలన్నారు. కార్మికుల హక్కుల సాధించే వరకు సమ్మె కొనసాగిస్తామని వెల్లడించారు. మామిడి చంద్రయ్య, సంపత్, రాజు, సత్యనారాయణ, రాజ్‌కుమార్, చంద్రయ్య, తిరుపతి, సంతోష్, హరీష్, సాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న దేవుని వార్షిక మహోత్సవాలు

తాండూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అబ్బాపూర్ గ్రామంలో కొలాం గిరిజనులు శుక్రవారం భీమన్న వార్షిక మహోత్సవాలను నిర్వహించారు. ఉదయం రాజుల పూజా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌పటాన్, సీఐ కుమారస్వామి, ఎంపీడీవో శ్రీనివాస్, మాదారం ఎస్ఐ సౌజన్య, నాయకుడు సూరం రవీందర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు జలపతి పటేల్, మాజీ ఉపసర్పంచు పరపతిరావు, గున్నాల శేఖర్, కమిటీ సభ్యులు కన్నయ్య, మడావి అమృతరావు, మాణిక్‌రావు పాల్గొన్నారు.

ఎల్లాగౌడ్ సేవలు చిరస్మరణీయం

మందమర్రి టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి దివంగత ఎల్లాగౌడ్ ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తెలిపారు. శుక్రవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ నివాసంలో ఆయన వర్ధంతికి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీలో వివిధ పదవులు చేపట్టిన ఎల్లాగౌడ్ ప్రజలకు అంకిత భావంతో పని చేశారని తెలిపారు. నాయకులు సొత్కు సుదర్శన్, కాంపెల్లి సమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, రాజయ్య, రమేష్, గండం రాంచందర్, పైడిమల్ల నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల హక్కుల సాధన కోసం పోరాడాలి

మందమర్రిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): యాదవుల హక్కుల సాధన కోసం పోరాడాలని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని శుభం కన్వెన్షన్ హాలులో నిర్వహించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో మాట్లాడారు. సంఘం పటిష్టతకు కృషి చేయాలన్నారు. యాదవులకు ప్రత్యేక రుణాలు ఇప్పించేందుకు పాటు పడాలని కోరారు. సంఘం డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. జిల్లా నాయకులు మల్లెత్తుల నరేష్, రాజన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

భీమారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా గోదాదేవి కల్యాణ మహోత్సవ పూజలను అర్చకులు తిరునంగిరి కన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

బెల్లంపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం పక్కన ఇందిర మహిళ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్యాంటీన్‌లను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు బండి ప్రభాకర్, గెల్లి రాజలింగు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, జనరల్ సెక్రటరీ సింగతి రాజేష్‌లు ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. న్యాయవాదులు రాజేష్, సునీల్, జుబైర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

హాజీపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు కిశోర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సూర్యతేజలు పేర్కొన్నారు. శుక్రవారం ముల్కల్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే అభివృద్ధి

మందమర్రిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాదిగ, దాని ఉపకులాల అభివృద్ధి సాధ్యమని డాక్టర్ జానపాటి శరత్ బాబు తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి శమీ అక్తర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలోనే దేవేందర్ సింగ్, రామచంద్రరాజు, ఉషామెహ్రా కమిషన్ రిపోర్టు ఇచ్చిం దన్నారు. వైద్యుల నియామకంలో కూడా తీరని అన్యాయం జరిగిందన్నారు.

ఎస్సీ కమిషనర్‌కు వినతి

లక్షెట్టిపేట,(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ కమిషనర్ అక్తర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. దేశ వ్యాప్తంగా కులాల దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచి వర్గీకరిస్తే అంగీకరిస్తామన్నారు. గరిసె రవీందర్, మినుముల శాంతికుమార్, గుత్తికొండ శ్రీధర్, భైరం రవి, ప్రేంసాగర్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై విద్యార్థులకు పోటీలు

దండేపల్లి, జనవరి3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంగ్ల భాషా నైపుణ్యంపై మండలస్థాయి పోటీలను నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్య పోటీలను నిర్వహించారు. పాఠశాల కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంగ్ల భాషాపై అవగాహన కలిగే ఉంటేనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. విద్యార్దులకు ఒలింపియాడ్ పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో ఎం.స్రవంతి (తాళ్ళపేట), ద్వితీయ స్థానంలో ధనుష్(వెల్గనూర్), ఒలింపియాడ్‌లో ప్రథమ ఆర్.జశ్వంత్(దండేపల్లి), ద్వితీయ జి.అభిరాం(వెల్గనూర్) ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బాలికల విద్య కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలల వేస్తున్న ఎమ్మెల్యే వినోద్, నస్పూర్‌లో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలిక విద్య కోసం కృషి చేసిన తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పూలే జయంతిలో డీసీపీ భాస్కర్, డీఈవో యాదయ్యతో కలిసి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్య కోసం మొట్టమొదటి బాలికల పాఠశాల స్థాపించారన్నారు. పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

బెల్లంపల్లి,(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు బండి ప్రభాకర్, నీలి కృష్ణ, అఫ్సర్ పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలో సెమినార్ నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ఎంఈవో దామోదర్‌రావు అందచేశారు. ట్రస్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు స్వరూపను సన్మానించారు. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రపాణి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రేగల్ల ఉపేందర్ పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు పొక్కూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ పట్వర్ధన్, హెచ్ఎం దత్తకుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): జైపూర్ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పూలే జయంతి నిర్వహించారు. నాయకులు వేముల మల్లేష్, ఆవిడపు గణేష్ పాల్గొన్నారు. ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక సంస్కర్త, మహిళ తొలి ఉపాధ్యాయురాలు పూలే జయంతిని నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు. రమాదేవి, మంజుల, పద్మలను సత్కరించారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సతీష్‌కుమార్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభ్యులు మాట్లాడుతూ చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): చార్వాక ట్రస్టు హాల్‌లో సావిత్రి బాయిపూలే జయంతి నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంటేశ్వర్‌గౌడ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తాలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ముల్కల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. సైకియాట్రిస్టు రామ్‌నాయక్ పరీక్షల్లో ఒత్తిడి గురి కాకుండా ఏ విధంగా సిద్ధమవ్వాలో తెలిపారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయులను సన్మానించి మెమోంటో అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎం పద్మావతి, సునీతదేవి, పూర్ణ, సభ్యులు పాల్గొన్నారు. బాలుర గిరిజన సంక్షేమ వసతి గృహంలో పూలే జయంతిని ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు నిర్వహించారు. శ్రీనివాస్, గోపాల్, వార్డెన్ లక్ష్మణ్, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు. సంజీవయ్య కాలనీలో పూలే జయంతిని అంబేద్కర్ సంక్షేమ సంఘం నిర్వహించారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయిపూలే విద్యావ్యాప్తికి కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే జయంతిని ముఖ్యమంత్రి మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం గొప్ప విషయమన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్దపల్లి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఊరు మందమర్రి జిల్లా పరిషత్ పాఠశాలలో పూలే జయంతి సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట ఉన్నత పాఠశాలలో ఎంఈవో మల్లేశం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహి ళా ఉపాధ్యాయులను సన్మానించారు. అరుణ, పర్వీన్‌సుల్తానా, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకులంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతిని మోడల్ స్కూల్, కళాశాలలో నిర్వహించారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం పూలే ఎంతో కృషి చేశారన్నారు. మహిళ టీచర్లను సన్మానించారు.బహుజన్ సమాజ్‌వాది పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చెన్నూరి రాజు ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, యువకులు, అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): దేవాపూర్, నాయకపుగూడ, కాసిపేట గనిపై పూలే జయంతి నిర్వహించారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు బన్న లక్ష్మణ్‌దాస్, ఒడ్నాల రాజన్న, కనుకుల తిరుపతి, మీనుగు లక్ష్మీనారాయణ, శంకర్, కొమ్ముల బాపు పాల్గొన్నారు.



పెరిగిన హమాలీల కూలి జీవోను విడుదల చేయాలి

కాగజ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హమాలీలకు పెరిగిన కూలి జీవోను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ సివిల్ సప్లయ్ హమాలీల నిరవధిక సమ్మెలో ఆయన మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాల ఒక సారి హమాలీ రేట్లను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసేందుకు ఒప్పుకున్నట్లు తెలిపారు. వెంటనే జీవోను వెంటనే విడుదల చేయాలన్నారు. సమ్మెలో జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, స్థానికులు, హమాలీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



రక్తదానం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం నాటికి దీక్షలు 25వ రోజుకు చేరుకోగా దీక్షా శిబిరంలో రక్తదాన శిబిరం నిర్వహించి నిరసన తెలిపారు. ఉద్యోగులకు పీజీహెచ్ఎంల సంఘం నాయకులు లతీఫ్, వెంకన్న, శ్రీనివాస్, హేమలత మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు మోహన్, తుకారాం, నాగసుధ, రమణ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హమాలీల సమ్మె..

జైనూర్: డిమాండ్ల సాధన కోసం మండలకేంద్రంలో హమాలీలు చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మేస్రాం ఇంద్రు మాట్లాడుతూ సివిల్ సప్లయి విభాగంలో పనిచేస్తున్న హమాలీల కూలి రేట్లను పెంచేవిధంగా జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు భోగే ఉపేందర్, హమాలీసంఘం నాయ కులు దత్తు, జుగాదిరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దరఖాస్తు



కమిషన్ సభ్యులకు దరఖాస్తు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయాధికారి డాక్టర్ షమీమ్ అక్తర్‌కు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దరఖాస్తు అందజేసినట్లు లుంబినీ దీక్ష భూమి సెంటర్ కమిటీ, జైభీంసేన నాయకులు అశోక్, వినోద్‌కుమార్, బాబురావు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి పురుషోత్తమచార్యులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలో గురువారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. మంచిర్యాల జిల్లా గూడెం అయ్యప్ప అలయం ప్రధాన అర్చకుడు, గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. జగిత్యాల జిల్లాకు చెందిన మణికంఠ గానలహరీ వారు చేసిన భజన, అయ్యప్ప స్వాముల భక్తిగీతాలు అలరించాయి. అయ్యప్ప స్వాముల పేటతుల్లి ఆకట్టుకుంది. మహాపడిపూజ కార్యక్రమానికి కెరమెరి, వాంకిడి, రెబ్బెన మండలాలకు చెందిన అయ్యప్ప స్వాములు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సోనేరావు దంపతులు, తనయుడు కోవ సాయినాథ్ హారిక దంపతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంకప్ బాక్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో రాణించిన అక్కాచెల్లెళ్లు, సోదరుడు



బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో కాగజ్‌నగర్‌కు చెందిన అక్కా,చెల్లెళ్లు, సోదరుడు తమ ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో డిసెంబరు31, జనవరి1,2తేదీల్లో నిర్వహించిన సీఎం కప్ ఫైనల్‌పోటీల్లో ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముత్త మోమోరియల్ బాక్సింగ్‌క్లబ్ నుంచి పలువురు హాజరయ్యారు. ఇందులో జూనియర్(40-42) విభాగంలో శ్రీశిత బంగారు పతకం సాధించింది. బాక్సింగ్ జూనియర్ విభాగంలో(46-48) శ్రీకర్‌కుమార్ సిల్వర్‌మెడల్ సాధించాడు. సబ్‌జూనియర్ విభాగంలో హర్షిత బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు వేముర్ల మధు తెలిపారు. ఈ పోటీల్లో బంగారు పతకానికి రూ.20 వేలు, సిల్వర్, బ్రాంజ్ పతకాలకు 15,10వేల చొప్పున నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సంద ర్భంగా మాస్టర్ శేఖర్‌ను అసోషియేన్ ఛైర్మన్ శివ నాయర్, రమాకాంత్, జయందర్, సీనియర్ బాక్సర్లు శివ, సాయి, వినయ్, వంశీ, లక్ష్మి, పీఈటి తదితరులు అభినందించారు.

షీటీంపై అవగాహన సదస్సు

రెబ్బెన/కాగజ్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రెబ్బెన కేజీబీవీ పాఠశాలలో, కాగజ్‌నగర్ జడ్పీఎస్ పెట్రోలు పంపు పాఠశాలలో శుక్రవారం షీటీంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జిలు సునీత, రమాదేవి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సమావేశంలో షీటీం సిబ్బంది స్వప్న, శ్రీలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 11కేవీ బెజ్జూరు విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలకేంద్రంతోపాటు చిన్నసిద్దాపూర్ గ్రామంలో విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ అంజన్‌కుమార్ కోరారు.

ధర లేదు.. దిగుబడి లేదు

పత్తి రైతులకు దక్కని మద్దతు ధర

- ప్రైవేటులో క్వింటాల్‌కు రూ.7000మాత్రమే
- రైతులకు కలిసి రాని కాలం

యేటేటా పత్తికి మద్దతు ధర పడిపోతోంది.. 2022లో క్వింటాల్ పత్తికి రూ.9,500 ఉండగా నేడు అది రూ.7000కు పడిపోయింది. ఈ ఏడాది మద్దతు ధర లభించక పోగా దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు కూలీల కొరత, పులి బెడద వెరసి పత్తి రైతులపై తీవ్ర ప్రభావం పడింది. తగ్గిన దిగుబడి, పెట్టుబడి ఖర్చులు, కూలీల రేట్లు కలిపితే మార్కెట్లో పత్తిని విక్రయిస్తే వచ్చేది ఏమీ లేదని భావిస్తున్న రైతు చేనులో ఉన్న పత్తిని ఏరాలా వద్దా అన్న సంశయంలో ఉన్నాడు.



నాలుగేళ్ల నుంచి క్వింటా పత్తి ధర పతనమైన తీరు కింది విధంగా ఉంది..

సంవత్సరం	ధర (క్వింటాల్‌కు)
2021-22	9500
2022-23	8250
2023-24	7200
2024-25	7000

బెజ్జూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పత్తికి మార్కెట్లో సరైన ధర లభించడం లేదు. అసలే దిగుబడి లేక నష్టాలను చవిచూస్తున్న పత్తి రైతుకు ఇది మరో దెబ్బ. జిల్లాలో అధికంగా రైతులు వాణిజ్య పంట అయిన పత్తివైపు మొగ్గు చూపుతారు. ఈ ఏడాది పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు అనుకూలంగా లేక దిగుబడి పూర్తిగా తగ్గింది. సాగుకు ఒక్కో ఎకరానికి సుమారు 25వేల నుంచి 30వేల వరకు ఖర్చు చేయగా మార్కెట్లోని మద్దతు ధరకు కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందని అన్నదాతలు దిగులు చెందుతున్నారు.తొలకరి ఆరంభంలో వర్షాలు ఆలస్యం కావడం ఆ తర్వాత వర్షాలు పుంజుకున్నా ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. పంట చేతికొచ్చే చివరి దశలో ఒక్క వర్షం కురిసినా దిగుబడి పెరిగేదని రైతులు పేర్కొంటున్నారు.

● తగ్గిన దిగుబడి..

సాగు కోసం రైతులు పత్తి విత్తనాలు మొదలుకొని పురుగుల మందులు కొనుగోలుకు వేల రూపాయలు ఖర్చు చేశారు. ఎరువులు, విత్తనాల ధరలు అమాంతం పెరిగినా రైతులు పత్తి పెద్ద మొత్తంలో సాగు చేశారు. జిల్లాలో ఈ ఏడాది 3.35లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. ఎన్నో ఆశలతో ఖరీఫ్‌కు శ్రీకారం చుట్టిన అన్నదాతలకు ప్రతీ ఏటా ప్రకృతి వైపరిత్యాల కారణంగా నష్టాలను చవిచూస్తున్నారు. పత్తి పంట చేతికచ్చే సమయంలో వర్షాలు కురవకపోవడంతో పత్తికి అన్నిరకాల నష్టాలు మొదలయ్యాయి.

● పెరిగిన కూలీల రేట్లు..

ప్రస్తుతం పత్తి పంట ఏరివేత సీజన్. పత్తి ఏరేందుకు జిల్లాలో కిలోకు రూ.10 నుంచి 15 ఇస్తున్నా కూలీల కొరత వేధిస్తోంది. అసలే పత్తి దిగుబడి లేక సరైన ధర లేక సతమతం అవుతుంటే కూలీ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటేటా పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి ఏరివేత చివరి దశ. కూలీల కొరత వేధిస్తోంది. మొన్నటి వరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కూలీలు ఇక్కడ పత్తి ఏరేందుకు వచ్చారు. ప్రస్తుతం పత్తి క్వింటాకు రూ.6800నుంచి 6900మాత్రమే లభిస్తోంది. దీనికి తోడు పత్తి దిగుబడి కూడా తగ్గడంతో సాగుకు చేసిన ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● వ్యాపారుల మాయాజాలం..

ప్రస్తుతం మార్కెట్‌లో ఒకవైపు పత్తికి ధర లేక రైతులు ఆందోళన చెందుతుండగా మరోవైపు వ్యాపారుల మాయాజలంతో కుదేలవుతున్నారు. రైతులు విక్రయించే పత్తికి 8నుంచి 12శాతం తేమ ఉంటే మద్దతు ధర రూ.7,521గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వ్యాపారులు సీసీఐతో సిండికేట్ కావడంతంతో తేమశాతం తక్కువ ఉందని రైతులను వెనక్కి పంపుతున్నారు. ఇదే సమయంలో వ్యాపారులు రంగంలోకి దిగి రైతుల వద్ద ఉన్న పత్తిని క్వింటాకు రూ.6800వరకు కొనుగోలు చేస్తున్నారు. అదే పత్తిని తిరిగి వ్యాపారులు అధిక ధరతో అమ్ముతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర రైతులకు అందక అన్ని విధాలుగా నష్టపోతున్నారు. తేమశాతం పేరుతో ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మార్కెట్ మాయాజాలం కారణంగా రైతన్నలకు ప్రతి ఏటా నష్టాల పాలవుతున్నారు. జిల్లాలో నాలుగేళ్ల నుంచి వరుసగా పత్తి ధర అమాంతం పడిపోతుండటంతో రైతులు ఇక పత్తి సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

తేమ పేరుతో కొర్రీలు..

- దుర్గం రాజారాం, రైతు ఎల్కపల్లి



తేమ పేరుతో అధికారులు కొర్రీలు పెడుతున్న కారణంగా సరైన మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నాం. దళారులకు పత్తిని అమ్మి తీవ్రంగా నష్టపోతున్నాం. సాగుచేసిన పత్తి దిగుబడి వచ్చాక చూస్తే చేసిన అప్పులు కూడా కట్టలేని స్థితిలో ఉన్నాం.

సావిత్రిబాయి ఫూలేను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేసిన సావిత్రిబాయి పూలేను మహిళా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన మహిళాఉపాధ్యాయ దినోత్సవంలో గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, విద్యాశాఖాధికారులతోకలిసి పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే బాలికలకు విద్యను అందించేందుకు విశేష కృషిచేశారని అన్నారు. జిల్లాలో దాదాపు 50శాతంపైగా మహిళా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. వారంతా సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని బాలికలు విద్యాక్రీడా రంగాలలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాను ముందు వరుసలో ఉండే విధంగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లావిద్యాశాఖ సహాయ సంచాకులు గమాన్నియల్, ప్రధానోపాధ్యాయుడు ఉదయబాబు, మహిళా ఉపాధ్యాయులు, విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

హైమన్‌డార్ఫ్ దంపతుల వర్ధంతిని విజయవంతం చేయాలి..

జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో ఈనెల 11న జరగనున్న ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ దంపతుల 38వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కమిటీ ప్రతినిధులతో కలిసి వర్ధంతి సంబంధిత ఆహ్వానపత్రికలు, వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్ధంతి వేడుకలను అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. అడవిబిడ్డల జీవనస్థితిగతులను అధ్యయనం చేయడానికి తమ జీవితాన్ని దారపోసి ఆదివాసీల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మహనీయులు ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ దంపతులు అన్ని అన్నారు. ఆదివాసీల సమగ్రఅభివృద్ధి కోసం ఆదివాసీలతో మమేకమై జీవించి ఆదివాసీలకు ఆత్మబంధువులుగా మారిన ఆదర్శమూర్తులన్నారు. ఈనెల 11న జరుగనున్న వర్ధంతిలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి..

జాతీయ రోడ్డు భద్రతామాసంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణాధికారి రామచందర్ నాయక్‌తో కలిసి కలెక్టర్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంవీఐ మోహన్, ఏఎంవీఐ రాజమల్లు, ఏవో అరుణ, కానిస్టేబుల్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వివిధ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ..

టీఎస్‌యూటీఎఫ్..

కౌటాల: మండలకేంద్రంలో శుక్రవారం సీఐరమేష్ టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇందురావ్, వినోద్, గుణాకర్, కిష్ణప్రశాంత్,విఠల్,తిరుపతి, సాయికుమార్, చిలుకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ..

రెబ్బెన: పీఆర్టీయూ క్యాలెండర్‌ను శుక్రవారం రెబ్బెనలో ఎంఈవో వెంకటేశ్వర్లు, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు బి సదానందం, ప్రధానకార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు ఆవిష్కరించారు.

ఆర్ఎంపీల..

బెజ్జూరు: మండలకేంద్రంలోని ఆర్ఎంపీ భవనంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరిశంకర్ శుక్రవారం ఆర్ఎంపీల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ సంఘం నాయకులు ఇబ్రహీం, సురేందర్, రాజేశ్వర్, హరి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్..

జైనూర్: మండలకేంద్రంలో శుక్రవారం పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయులు నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశాఖ జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎటకూరి శ్రీనివాస్‌రావ్, చునార్కర్ అనిల్‌కుమార్, జైనూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆత్రం దత్తు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సిర్పూర్(యు), జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోడసం ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

కెరమెరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మార్కెట్‌లో శుక్రవారం ఎస్సై విజయ్‌కుమార్ ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యంసేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, వాహన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఆదివాసీ ప్రధానసమాజ్ యువజన సంఘం

జైనూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ, కాంట్రాక్ట్ ఉద్యోగులు, రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ ప్రధానసమాజ్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందీశ్వర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సీఆర్టీలు సమ్మెతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. విద్యార్థుల భవిష్యతును దృష్టిలో పెటుకోని వెంటనే సీఆర్టీలు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజనసంఘం మండల ఉపాధ్యక్షుడు మడావి గణపతి, నాయకులు పెందూర్ సంతోష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు

సిర్పూర్(టి), జనవరి 3(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వెంపల్లి గ్రామపంచాయతీలోని మన్నెగూడలో పేదగిరిజనులకు దుప్పట్లు, విద్యార్థులకు నోట్ బుక్కులను జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్ పపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, అటవీశాఖ ఆధ్వర్యంలో అన్ని విధాల సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో శాంతారాం, తదితరులు ఉన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని రాజులుగూడ గ్రామంలో శుక్రవారం పెంతుకోస్తు స్వచ్ఛంద సంఘం అధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జోసెఫ్ ప్రజలు దైవచింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శశికిరణ్, జిల్లా పల్లి శంకర్,ఓరగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

జూడాల సమస్యలు పరిష్కరిస్తాం

- మెడికల్ కాలేజీని సందర్శించిన డీఎంఈ డాక్టర్ వాణి
- ఆందోళన విరమించిన విద్యార్థులు



విలేకరులతో మాట్లాడుతున్న వైద్యవిద్య డైరెక్టర్ వాణి

ఆసిఫాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్‌కాలేజీ విద్యార్థులు శుక్రవారం రెండోరోజు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఉదయం తరగతులను బహిష్కరించి కాలేజీ ఎదుట బైఠాయించి నిరసనచేపట్టారు. ఈ సందర్భంగా కాలేజీని డైరెక్టర్‌ఆఫ్‌మెడికల్ ఎడ్యూకేషన్ (డీఎంఈ) డాక్టర్ ఎన్ వాణి సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు ఆందోళన చేస్తున్న చోటికి వెళ్లి సమస్యలు చర్చించేందుకు రావాలని కోరగా విద్యార్థులు నిరాకరించారు. సమస్యలు తెలుసుకోవడం కోసమే తాను వచ్చానని డైరెక్టర్ పేర్కొనడంతో విద్యార్థులు చర్చలకు వెళ్లారు. సుమారు రెండుగంటల పాటు విద్యార్థుల సమస్యలపై డైరెక్టర్ చర్చించారు. అనంతరం విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా డీఎంఈ డాక్టర్ వాణి విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో నెలకొన్న పలు సమస్యలను తమదృష్టికి తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా బోధన సిబ్బంది నియామకాలు, శానిటేషన్ నిర్వహణ, హాస్టల్, రవాణా సౌకర్యం తదితర అంశాలను తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసిఫాబాద్ జిల్లా చాలా వెనుకబడిన ప్రాంతం కావడంతో ప్రొఫెసర్లు, బోధనసిబ్బంది ఇక్కడికి వచ్చేందుకు ముందుకు రావడంలేదన్నారు. బోధనసిబ్బందిని ప్రభుత్వం నియమిస్తున్నదని ఇటీవల ఆరుగురు ప్రొఫెసర్లను నియమించగా వారు జాయిన్ కాలేదన్నారు. వెనుకబడిన జిల్లాల్లో బోధన సిబ్బంది నియామకాలపై ప్రభుత్వం ఒక పాలసీని తీసుకువచ్చేందుకు ఆలోచిస్తోందన్నారు. వెనుకబడిన జిల్లాలైన కుమరంభీం, భద్రాద్రీ కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో బోధన సిబ్బందికి ప్రత్యేక అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు ఇచ్చేందుకు యోచిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. కళాశాలలో శానిటేషన్ నిర్వహణలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. దానిని వెంటనే పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించామన్నారు. విద్యార్థులు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారని త్వరలోనే ఆర్టీసీ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. వసతిగృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేస్తామన్నారు. సమీప జిల్లాలైన ఆదిలాబాద్, మంచిర్యాల నుంచి బోధన సిబ్బందితో తరగతులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. విద్యార్థుల ప్రయోగాల నిమిత్తం ఆదిలాబాద్ నుంచి రెండు డెడ్‌బాడీలను తెప్పిస్తామన్నారు. విద్యార్థుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని విద్యార్థులు విద్యపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.